‘డబుల్ ఇండ్ల’కు ట్యాంకరే దిక్కు!

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం రాంపూర్‌లో డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో తాగునీటి సమస్య వేధిస్తున్నది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే రోడ్డు నిర్మాణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచిపోయిందంటూ సమాధానమిస్తున్నారు. దీంతో పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. –కోటగిరి

పాలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంటాల శివారులో శుక్రవారం కామారెడ్డి ఆర్టీసీ డిపో బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులకు గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని డిపో మేనేజర్ ఇందిర పరిశీలించారు. –గంభీరావుపేట

గుడిపేటలో పంచాయతీ కార్యాలయానికి వచ్చి నిరసన తెలుపుతున్న మహిళలు

గుడిపేటను కార్పొరేషన్‌లో కలపొద్దు

మంచిర్యాల, జనవరి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో తమ గ్రామ పంచాయతీని విలీనం చేయొద్దని గుడిపేటకు చెందిన ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మంచిర్యాలతోపాటు నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలం పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూర్, చందనాపూర్, ముల్కల, కొత్తపల్లి, వేంపల్లి పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనంచేసింది. కాగా గుడిపేట ఉపాధిహామీ కూలీలు తమ పంచాయతీని కార్పొరేషన్‌లో కలపొద్దంటూ శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు కలిపి వినతిపత్రాలు ఇస్తామన్నారు. అప్పటికీ వారు స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

గురుకుల విద్యార్థులను చితకబాదిన ప్రిన్సిపాల్

- అల్లరి చేశారంటూ.. గదిలో బంధించి దాడి
- నల్లగొండ మైనార్టీ గురుకులంలో ఘటన
- పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ఉపాధ్యాయులను నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉపాధ్యాయులు కొట్టడంతో విద్యార్థి తొడపై కమిలిన దృశ్యం

రామగిరి, జనవరి 31: పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఉపాధ్యాయులు కర్కశత్వంతో వారిని గదిలో బంధించి చితకబాదిన ఘటన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్‌బీసీ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం వెలుగు చూసింది. పాఠశాల గోడలమీద రాతలు రాశారంటూ 7వ తరగతికి చెందిన 10 మంది విద్యార్థులను ఈ నెల 28న గదిలో బంధించి ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు జ్యోతిబసు, బాబా వైర్లు, కర్రలతో చితకబాదారు. శుక్రవారం తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి చూడగా ఓ పిల్లవాడి ఒంటిపై వాతలు, రక్తం వచ్చినట్లు గాట్లు ఉండడంతో ఏమి జరిగిందని ఆరాతీశారు. దాంతో తమను ఉపాధ్యాయులు కొట్టినట్టు సదరు విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. ఇదే విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ప్రశ్నించగా వారు విద్యార్థులు గోడలపై రాతలు రాయడంతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగగా ఉపాధ్యాయులు క్షమాపణ చెప్పడంతో పాటు మళ్లీ ఇలాంటి ఘటన జరుగకుండా చూస్తామని బతిమిలాడారు.దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేయిచేయి కలిపి.. పూడికతీత చేపట్టి!

- నీటి నిల్వ పెంచేందుకు ముందుకొచ్చిన రైతులు

అయిజ, జనవరి 31 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం బింగిదొడ్డి చెరువులో నీటి నిల్వలు పెంచేందుకు రైతులు ముందుకొచ్చారు. తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువుకు నీరొచ్చేందుకు తూము ఉన్నా కాల్వ పూర్తికాకపోవడంతో నీటి చేరిక ఆలస్యమవుతున్నది. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో మత్స్య సహకార సంఘంతో కలిసి 15 మంది కర్షకులు స్వచ్ఛందంగా కదిలారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువు వరకు నీటిని పారించేందుకు 3 కిలోమీటర్ల డీ-1 కాల్వలో పూడికతీత తొలగింపు పనులు శుక్రవారం చేపట్టారు. ముళ్లపొదల తొలగింపు పనులకు రూ.3 లక్షల వరకు ఖర్చు కావచ్చని, సొంతంగా డబ్బులు వేసుకొని పనులు చేపడుతున్నట్టు రైతులు తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు

దవాఖానల్లో ఫీజుల దోపిడీని అరికట్టండి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జనవరి 31 : ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు చంద్ర అరుణ, వాంకుడోతు అజయ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందకపోవడంతో నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, దీనిని ఆసరా చేసుకుని ఫీజుల పేరిట దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. వివిధ రకాల టెస్టులు, మందుల పేరుతో లక్షల బిల్లులు వేస్తున్నారని మండిపడ్డారు. పై సమస్యలు పరిష్కరించని పక్షంలో తమ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బుచ్చిరాజు, సావిత్రి, కెచ్చల కల్పన, ధరావత్ దేవా, కొర్స రామకృష్ణ, పూనెం మంగయ్య, లక్ష్మణరావు, దుర్గ, నూపా సరోజిని, కల్లూరి పద్మ పాల్గొన్నారు.

సీఐపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

- జమ్మికుంట సీఐ బాధితుల డిమాండ్

హుజూరాబాద్, జనవరి 31: కరీంనగర్ జిల్లా జమ్మికుంట సీఐ వరగంటి రవిపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్త షేక్ షాబీర్ అలీ, దళిత సంఘం నాయకుడు అంబాల రాజు, సీఐ బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు జమ్మికుంటలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. కాటేపల్లి లక్ష్మి అనే వృద్ధురాలు మాట్లాడుతూ తనకు సంబంధించిన భూమిని ఏనుగు జయపాల్‌రెడ్డి ఆక్రమించుకోవాలని చూస్తున్నాడని సీఐకి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆర్డీవో నిర్లక్ష్యంతో తనకు అన్యాయం జరిగిందని వాపోయింది. కాటిపల్లి సంధ్యారాణి మాట్లాడుతూ సీఐ అరాచకాల మూలంగా తాను కట్టుబట్టల్లో మూత్రం పోసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. సీఐ అరాచకాలతో పాటు అతడిని కాపాడుతున్న ఏసీపీపై కూడా క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

వీర్ల నర్సవ్వ | ఆది రాజవ్వ

మహా కుంభమేళాకు వెళ్లి ..

- తప్పిపోయిన జగిత్యాలవాసులు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 31 : మహాకుంభమేళాలో జగిత్యాలకు చెందిన ఇద్దరు మహిళలు తప్పిపోయారు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన వీర్ల నర్సవ్వ (56), కొత్తవాడకు చెందిన ఆది రాజవ్వ (55)తోపాటు పట్టణానికి చెందిన మరో ఎనిమిది మంది, కడెంకు చెందిన మరో ఇద్దరు మహిళలు కలిసి జనవరి 27న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు వెళ్లారు. 28న అక్కడికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి వీర్ల నర్సవ్వ, ఆది రాజవ్వ తప్పిపోయినట్టు వీరితో వెళ్లిన మహిళలు జగిత్యాలలోని బంధువులకు సమాచారం అందించారు. ఆచూకీ కనిపెట్టేందుకు బంధువులు ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరినట్టు తెలిసింది.

ఆదిలాబాద్ అడవుల్లో అరుదైన హైనా

హైదరాబాద్/ ఆదిలాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో అరుదైన హైనా కెమెరాకు చిక్కింది. ఈ నెల 28 మావల మండలం అర్బన్ ఫారెస్ట్‌లో అటవీశాఖ అధికారులు ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం సీసీ కెమెరాలో హైనా తిరుగుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దేశంలోనే అరుదైన చారల హైనా ఆదిలాబాద్ అడవుల్లో సీసీ కెమెరాకు చిక్కడం అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల ఫలితమేనని అటవీ అధికారులు తెలిపారు. ఎఫ్ఆర్‌వో గులాబ్‌సింగ్ మాట్లాడుతూ.. ఎప్పుడో కొన్నేండ్ల క్రితం కనిపించకుండా పోయిన హైనాలు తిరితి మావల హరితవనంలో కనిపించడం సంతోషంగా ఉందన్నారు.

ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 31 : మావోయిస్టుల ఆపరేషన్స్‌లో క్రియాశీలకంగా పాల్గొన్న ఏడుగురు మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారు. శుక్రవారం పోలీసులు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. లొంగిపోయిన వారిలో డీవీసీఎం మమతతోపాటు ముగ్గురు మావోయిస్టుల్లో ఒక్కొక్కరిపై రూ.8 లక్షలు, ఒక సభ్యుడిపై రూ.5 లక్షలు, మిగతా ఒక్కొక్కరిపై రూ.లక్ష చొప్పున రివార్డులు ఉన్నట్టు పేర్కొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న కాంకేర్ జిల్లా పోలీస్ అధికారులు

మున్సిపల్ మాజీ చైర్మన్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

బెల్లంపల్లి, జనవరి 31 : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు పై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో హరికృష్ణకు వినతిపత్రం అందించారు. మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో అక్రమ నిర్మాణాన్ని కూల్చడానికి వచ్చిన తహసీల్దార్ జ్యోత్స్న విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా ఆమె పట్ల దురుసుగా ప్రవర్తించారని పేర్కొన్నారు. దళిత మహిళ అని చూడకుండా నిర్మాణాలు ఎలా కూలుస్తావంటూ అమర్యాదగా.. కించపరిచేవిధంగా ఆయన మాట్లాడరని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూరిబాబుతో పాటు వెంట ఉండి బెదరింపులకు పాల్పడిన కాంగ్రెస్ పార్టీ నాయకులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు అరుణ్, అలీ, సతీష్, మహేశ్, చరణ్, శ్రీనివాస్,రోషన్ పాల్గొన్నారు.

ఆర్డీవో హరికృష్ణకు వినతిపత్రం సమర్పిస్తున్న బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్

రోడ్డు నియమాలు పాటించాలి

చెన్నూర్ : ర్యాలీ ప్రారంభిస్తున్న జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

మంచిర్యాల అర్బన్ : ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న డీటీవో

ఆసిఫాబాద్ టౌన్ : ఉత్తమ డ్రైవర్లను సన్మానిస్తున్న డీటీవో, డిపో మేనేజర్

మంచిర్యాల అర్బన్, జనవరి 31 : వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని మంచిర్యాల జిల్లా రవాణా శాఖ అధికారి సంతోష్ కుమార్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం ప్రయాణికులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందాలతో పాటల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం జనార్దన్, ఏఎంవీఐలు ఖాసీం సాహెబ్, సూర్యతేజ, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుళ్లు, హోంగార్డులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌లో..

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 31 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్‌తో కలిసి జిల్లా రవాణా శాఖ అధికారి రామ్ చందర్ హాజరయ్యారు. ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ ఆర్టీసీలో ప్రమాదాల రేటు చాలా తక్కువగా ఉందని, ఇలాగే కొనసాగించాలని డ్రైవర్లకు సూచించారు. అనంతరం డిపో మేనేజర్ మాట్లాడుతూ.. ప్రమాదాల రేటు తగ్గించడంలో డ్రైవర్ల కృషి ఎంతో ఉందన్నారు. 30 ఏళ్లుగా ప్రమాద రహిత డ్రైవింగ్ చేసిన డ్రైవర్లు అన్వర్ ఖాన్, కుతుబుద్దీన్, జమీల్ ఖాన్‌కు ఉత్తమ డ్రైవర్లుగా ప్రశంసా పత్రం అందించి, సన్మానించారు. ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, గ్యారేజ్ ఇన్‌చార్జి ఉదయ్, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి : జైపూర్ ఏసీపీ

చెన్నూర్ టౌన్, జనవరి 31 : రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఏసీపీ జైపూర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చెన్నూర్ పట్టణంలో పోలీసులు బైక్ ర్యాలీ తీశారు. పట్టణ సీఐ రవీందర్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ నుంచి పాత బస్టాండ్ మీదుగా ర్యాలీ సాగింది. జలాల్ పెట్రోల్ బంక్ నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్, ఎస్ఐ సుబ్బారావు, పోలీసులు, సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

‘సోలార్’తో రైతులకు ఆర్థిక పరిపుష్టి

మంచిర్యాలటౌన్, జనవరి 31 : వ్యవసాయానికి అనుకూలంగా లేని, బంజేరు భూముల్లో రైతులు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా పరిపుష్టి సాధించవచ్చని మంచిర్యాల విద్యుత్ శాఖ ఎస్ఈ వీ గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, అర్హతలు కలిగిన లబ్ధిదారులు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకునేందుకు తమ ఆసక్తిని తెలియపర్చాలని, పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. 4000 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయ ఉత్పత్తి సంఘాలు, రైతు సమూహాలు, నీటి వినియోగదారుల సంఘాలు, సహకార సంఘాలు, స్వయం సహాయక బృందాలు, పంచాయతీలు, గ్రామ సంస్థలు, మండల సమాఖ్యలు, డెవలపర్స్ (రైతుల భూమి లీజు ఒప్పందం ద్వారా) అర్హులని వివరించారు. 500కేడబ్ల్యూ నుంచి 2 మెగావాట్ల వరకు ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ఒక మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేసుకునేందుకు 3.5 నుంచి 4 ఎకరాలు అవసరమవుతుందని పేర్కొన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (టీజీఈఆర్‌సీ) నిర్ణయించిన టారిఫ్ ప్రకారం ఉత్పత్తి చేయబడిన విద్యుత్‌ను విద్యుత్ సంస్థ కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. ఇలా బంజేరు, వ్యవసాయానికి అనుకూలంగా లేని భూములను ఆదాయ వనరులుగా మార్చుకొని, 25 ఏళ్లపాటు రైతులు నిలకడైన ఆదాయం పొందుతారని వెల్లడించారు. వివరాల కోసం, దరఖాస్తు నమోదు కోసం వెబ్ సైట్ www.tgredco.telangana.gov.in లో లాగిన్ కావాలని సూచించారు. దరఖాస్తులకు ఫిబ్రవరి 22 గడువు అని వివరించారు. టీజీ రెడ్కో డీజీఎం 63049 03933, జీఎం 90005 50974 నంబర్లను సంప్రదించి, తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని కోరారు.

డోర్లి-2 ఓసీపీ సందర్శన

ప్రొఫెసర్ సుదీప్తా ముఖోపాధ్యాయను సన్మానిస్తున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన, జనవరి 31 : బెల్లంపల్లి ఏరియాలో ముతపడిన డోర్లి-2 ఓసీపీ గనిని శుక్రవారం ఐఐఈఎస్‌టీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, శిబ్‌పూర్ వెస్ట్‌బెంగాల్) ప్రొఫెసర్ సుదీప్తా ముఖోపాధ్యాయ సందర్శించారు. ముందుగా ప్రొఫెసర్‌ను గోలేటి జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం శ్రీనివాస్ పూల మొక్క అందించి సనామనించారు. ఏరియా వివరాలు వివరించారు. ఓసీపీ పరిసర ప్రాంతాల్లో చేపట్టిన పర్యావరణ, ప్రజాహిత పనులు, కట్టడాలు, నాటిన మొక్కలు, పెరిగిన వృక్షాలను పరిశీలించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి, ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, కార్పొరేట్ అదనపు మేనేజర్లు వీ తిరుపతి, గోనె బాబ్జి, డోర్లి మేనేజర్ మహేశ్‌కుమార్, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీశ్, ఫారెస్ట్ అధికారి రమణారెడ్డి, సర్వేయర్లు రామరాజు, స్వామి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేటలో పొరహక్కుల దినోత్సవం

తాండూర్, జనవరి 31 : మండలంలోని కాసిపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గిర్ధావార్ అంజన్‌కుమార్ పొరహక్కుల దినోత్సవం నిర్వహించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ కులస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని అన్ని వర్గాల వారు, గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ మధ్య తగాదాలు లేవని, అందరం సోదరభావంతో కలిసి ఉంటామని పేర్కొన్నారు. అధికారులు, నాయకులు, కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మండలస్థాయి టాలెంట్ టెస్ట్

తాండూర్‌లో టాలెంట్ టెస్ట్ పర్యవేక్షిస్తున్న ఎంఈవో మల్లేశం, ఉపాధ్యాయులు

తాండూర్, జనవరి 31 : ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ సూచనల మేరకు శుక్రవారం విద్యార్థులకు తాండూర్ జడ్పీహెచ్ఎస్‌లో టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు ఎంఈవో ఎస్ మల్లేశం తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి ముగ్గురు చొప్పున 12 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఎస్ జస్వంత్ ప్రథమ (10వ తరగతి, అచ్చలాపూర్ జడ్పీహెచ్ఎస్), ఏ కిరణ్ ద్వితీయ (10 తరగతి, రేచిని జడ్పీహెచ్ఎస్), ఎన్ వైష్ణవి తృతీయ (10వ తరగతి, తాండూర్ కేజీబీవీ) విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు. వీరికి తాండూర్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్ జ్ఞాపకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్పీఎస్‌టీ రాష్ట్ర బాధ్యులు విద్యాసాగర్, వివిధ పాఠశాల నుంచి వచ్చిన సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దండేపల్లిలో..

దండేపల్లి, జనవరి31 : దండేపల్లి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో వెల్గనూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అక్షయ, శ్రీ వైష్ణవి, తృతీయ స్థానంలో అంజి గుడిరేవు ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్ సాయి చరణ్, లింగాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు బహుమతులు సాధించారు. జిల్లాస్థాయి పరీక్షలకు ఎంపిక య్యారు. హెచ్ఎం శ్రీనివాస్, ప్రతిభ పరీక్ష ఇన్‌చార్జి అప్పాల మనోహర్, సీఆర్పీ గరిగె నర్సయ్య, సంఘర్స్ రాజేశ్వర్‌రావు, పాత రమేశ్, బొలిశెట్టి రాజన్న, రాజశేఖర్, వినోద్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాసిపేటలో..

కాసిపేట, జనవరి 31 : కాసిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి టాలెంట్ టెస్ట్‌లో కాసిపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని హరిణి, ధర్మారావుపేట పాఠశాలకు చెందిన కావ్యశ్రీ, కేజీబీవీకి చెందిన శివాణి విజేతలుగా నిలిచిట్లు ఎంఈవో ముక్తవరం వెంటేశ్వర స్వామి తెలిపారు. వీరు జిల్లా సాథయికి ఎంకైనట్లు పేర్కొనారు. ఎఫ్పీఎస్‌టీ జిల్లా నాయకులు జీ రాజేశం, సమన్వయకర్తలు అన్నం రమణారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, స్వర్ణ, సంతోష్, పల్లె కృష్ణగోపాల్ రావు పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్ల గుర్తింపు కార్డుకు దరఖాస్తులు

గుర్తింపు కార్డు అందజేస్తున్న అధికారి భాస్కర్

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 31 : అర్హులైన ట్రాన్స్ జెండర్లు గుర్తింపు కార్డు, ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురికి శుక్రవారం గుర్తింపు కార్డులను అందజేశారు. అర్హులైన ట్రాన్స్ జెండర్లు స్థిరమైన ఆదాయాన్ని పొందేందుకు ప్రభుత్వం దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ ద్వారా పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నదన్నారు. ఇప్పటివరకు జిల్లాలో దరఖాస్తు చేసుకున్న 42 మంది ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డు, ట్రాన్స్ జెండర్ ధృవపత్రం అందజేసినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా ఉంటే జిల్లా సంక్షేమ శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ రవికుమార్‌ను సంప్రదించాలని సూచించారు.

విరమణ కార్మికులకు సన్మానం

శ్రీరాంపూర్, జనవరి 31 : శ్రీరాంపూర్ ఏరియా గనులపై శుక్రవారం విరమణ పొందిన కార్మికులను అధికారులు, నాయకులు ఘనంగా సన్మానించారు. ఆర్కే-7 గనిపై డిప్యూటీ సూపరింటెండెంట్ గోపాల్ రెడ్డి, లైన్‌మన్ రాములు, కోల్‌కట్టర్ మేడ పోచయ్యను ఏజెంట్ రాజేందర్, మేనేజర్ తిరుపతి, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి బానోత్‌రాజూనాయక్ సన్మానించి, టర్మినల్ బెనిఫిట్ చెక్కులు అందించారు. ఈఈ ప్రవీణ్, రమేశ్, అధికారులు రవీందర్, బాలకృష్ణ, రవితేజ, సీనియర్ పీవో సంతన్, పిట్ కార్యదర్శి మారెపల్లి సారయ్య, నాయకుల మల్లికార్జున్, గద్దల వెంకటేశ్, నర్సింహ, ప్రతాప్, రాజేందర్, పాదం శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆర్కే 6గనిపై విరమణ పొందిన పెద్ది నారాయణ, ఆకుల రవీందర్, ఆలోత్ లచ్చు, ఏ నారాయణను మేనేజర్ తిరుపతి, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, పిట్ కార్యదర్శి సంఘం సదానందం సన్మానించారు. సేఫ్టీ ఆఫీసర్ కాదాసి శ్రీనివాస్, ఈఈ శ్యాంకుమార్, ఎస్పీ వర్మ, సీనియర్ పీవో సురేందర్, నాయకులు ముత్యాలు, క్రాంతికుమార్, నగేశ్, సాయిబాబ, సురేశ్ పాల్గొన్నారు.

రెబ్బెన, జనవరి 31 : బెల్లంపల్లి ఏరియా ఖైర్‌గూడ ఓసీపీలో ఈపీ గ్రేజర్ అన్నం లక్ష్మయ్య, పంప్ ఆపరేటర్ బొంతల సుదర్శన్ విరమణ పొందగా, గని అధికారులు, వివిధ యూనియన్ల నాయకులు, తోటి ఉద్యోగులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ సంగెం ప్రకాశ్‌రావు, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు శేషశయనరావు, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.